సాక్షి చిత్తూరు

సోమవారం । 8 । జనవరి । 2024



జిల్లా వాలీబాల్ జట్టు ఎంపిక

జిల్లా రూరల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి అశ్వంధర్ జిల్లా వాలీబాల్ జట్టును ప్రకటించారు. - 8లో



సాక్షి స్పెల్‌బీకి విశేష స్పందన

సాక్షి ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహించిన స్పెల్ బీ సెమీస్ పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. - 8లో



చెకుముకి పోటీలు విజయవంతం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పలమనేరులో నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి పోటీలు విజయవంతమయ్యాయి. - 8లో

న్యూస్‌రీల్

భక్తులతో కిక్కిరిసిన బోయకొండ



బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనం కోసం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. అమ్మవారి దర్శనార్థం భక్తులు తరలి వచ్చి మొక్కులు చెల్లించారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలను ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఆలయ ఈఓ చంద్రమౌళి పర్యవేక్షించారు. భక్తులకు ఉచిత తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలన్నారు. మధ్యాహ్నం 1 గంట వరకు స్పందన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు స్పందన కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. గైర్హాజరైతే శాఖాపరంగా కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

పోలీసు కార్యాలయంలో..

చిత్తూరు అర్బన్: నగరంలోని పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఆర్మ్డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని, ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి మాట్లాడొచ్చని పేర్కొన్నారు.

నవశకం

సేద్యానికి భరోసా

గతంలో ప్రభుత్వ తోడ్పాటు లేక, ప్రకృతి విపత్తులకు తాళలేక, వరుణుడు కరుణించక వరుస కరువు వెంటాడడంతో ఏమి చేయాలో దిక్కు తోచని స్థితిలో ఉన్న కర్షకుడికి జగన్ సర్కారు ఊపిరి పోసింది. నాలుగున్నరేళ్ల కిందట అధికారం చేపట్టగానే వ్యవసాయాన్ని పండగలా మార్చేందుకు రైతు భరోసా కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నకిలీ విత్తనాలు, నాణ్యత లేని ఎరువుల వల్ల అన్నదాతలు నష్టపోకుండా ఎమ్మార్పీకే ఆర్బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు కర్షకుల పాలిట వరంగా మారాయి.

- కర్షకులకు తోడుగా రైతు భరోసా కేంద్రాలు
- వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న జగనన్న ప్రభుత్వం
- ఏ పంటలు సాగు చేయాలో తెలిసేందుకు ఏటా భూసార పరీక్షలు
- నాణ్యమైన విత్తనాల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేదు
- ఆర్బీకేల్లో ఎమ్మార్పీకే ఎరువులు, విత్తనాలు
- ఆనందంగా పంటలు సాగుచేస్తున్న అన్నదాతలు



చందంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ భరత్, నాయకులు (ఫైల్)

కుప్పం నియోజకవర్గంలో ఆర్బీకేల వివరాలు

ఆర్బీకేలు - 81	సిబ్బంది - 70
నియోజకవర్గ పరిధిలో సాగయ్యే వివరాలు	
వేరుశనగ	14256 ఎకరాలు
వరి 3670	టమాటా 3052
కూరగాయల సాగు	2847
అన్నిరకాల పూల సాగు	1253
మొక్కజొన్న 450	మల్బరీ 1852
మొత్తం పంటలు సాగయ్యేది 48,360 ఎకరాలు	
రైతు భరోసా ద్వారా లబ్ధి పొందుతున్న రైతులు 38596 మంది	
రైతులకు ప్రభుత్వం అందించిన సాయం రూ.36.667 కోట్లు	

ఆర్బీకేల్లో అందుతున్న సేవలు

- భూసార పరీక్షలు
- వైఎస్సార్ యంత్ర సేవ ద్వారా అందుబాటులో వ్యవసాయ పరికరాలు
- సున్నావడ్డీతో బ్యాంకు రుణాలు
- పొలంబడి ద్వారా రైతులకు పొలాల్లోనే శిక్షణ
- సబ్సిడీపై వేరుశనగ, పచ్చిరొట్ట విత్తనాలు
- విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు
- సీఎం యాప్ ద్వారా పంటలకు గిట్టుబాటు ధర
- డిజిటల్ ఆధారిత సేవల ద్వారా ఈ మల్టీ ఫంక్షనల్ రియోస్కులు

కుప్పం: అన్నదాతలకు అండగా, పంటలు సాగు చేసే రైతులకు తోడుగా ప్రభుత్వం నిలుస్తోంది. కొంతకాలం కిందటి వరకు కూడా వ్యవసాయం అంటే భయపడే పరిస్థితులు ఉండేవి. అలాంటిది నాలుగున్నరేళ్ల కిందట అధికారం చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగలా మార్చేసింది. పంటల సాగు నుంచి అధిక దిగుబడి వచ్చే వరకు రైతు భరోసా కేంద్రాల సిబ్బంది అన్నదాతలకు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. నకిలీ విత్తనాలు, ఎరువుల వల్ల నష్టపోకుండా ఆర్బీకేల్లోనే వాటిని అందించి, సాంకేతిక సహకారం, మార్కెట్ సదుపాయం కలిపించింది. ధాన్యం కూడా కొనుగోలు చేసి అన్నదాతకు కొండంత అండగా నిలుస్తున్నారు సీఎం జగన్.

సీజన్ స్టార్ట్ కాగానే పరుగులు

రబీ, ఖరీఫ్ సీజన్లు మొదలు కాగానే రైతుల గుండెల్లో గుబులు మొదలయ్యేది. విత్తనాలు, ఎరువుల కోసం అప్పులు చేసేవారు. విత్తనాల కోసం పక్క రాష్ట్రమైన తమిళనాడులోని కావేరిపట్నానికి వెళ్లేవారు. ఆర్‌బీకేల ఏర్పాటుతో ఆ సమస్యలకు చెక్ పడింది. రైతులు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందుకుంటున్నారు. పంటల సాగుకు ఆర్బీకే సిబ్బంది అందించే సలహాలు, సూచనలతో అధిక దిగుబడి పొంది ఆదాయం గడిస్తున్నారు.





వానగుట్టపల్లిలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న ఆర్బీకే అధికారులు, భూసార పరీక్షలు చేస్తున్న సిబ్బంది

మద్దతు ధర లభిస్తోంది



రైతు భరోసా కేంద్రాలు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి పంటలను మద్దతు ధరకే కొనుగోలు చేస్తున్నారు. గతంలో పంట చేతికి వచ్చే సమయంలో దళారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించేవారు. ఇప్పుడు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తోంది. సీజన్ ప్రకారం విత్తనాలు సరఫరా చేసి, వాటికి కావాల్సిన మందులను ఆర్బీకేల ద్వారా అందిస్తున్నారు.

– ఎల్లమ్మ, వసనాడు

నకిలీల సమస్య తప్పింది



ఆర్బీకేలు వచ్చిన తరువాత నకిలీ విత్తనాల సమస్య తీరింది. ప్రస్తుతం అధికారుల పర్యవేక్షణలో విత్తనాలను రైతులకు ఆర్బీకేల ద్వారా అందిస్తున్నారు. గతంలో ఇక్కడి రైతులు విత్తనాల కోసం తమిళనాడులోని కావేరిపట్నం, కర్ణాటకలోని కోలారు, బంగారుపేటకు వెళ్లేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

– లక్ష్మణప్రసాద్, గోవిందపల్లి, గుడుపల్లె మండలం

ఇక్కడే ఎరువులు దొరుకుతాయి



మూడేళ్లుగా పంటలకు కావాల్సిన ఎరువులు మా ఊరి ఆర్బీకేలో అందుబాటులోకి వచ్చాయి. ఏటా ఎరువుల కోసం మండల కేంద్రం, పక్కన ఉన్న తమిళనాడుకు వెళ్లి తెచ్చుకునే వాళ్లం. అక్కడ దొరక్కపోతే విధిలేని పరిస్థితుల్లో ఎరువుల దుకాణ యజమానులు ఇచ్చే నాణ్యత లేని ఎరువులు వేసేవాళ్లం. ఇప్పుడు ఆర్బీకేల్లో సబ్సిడీపై యూరియా, పొటాషియం, కాంప్లెక్స్ ఎరువులు తెచ్చుకుంటున్నాం. ఆర్బీకేలు వచ్చిన తరువాత వ్యవసాయం పండగలా మారింది.

– రఘు, తంగేడుకుప్పం

ఈ–క్రాప్‌తో రైతులకు ఉపయోగం



పంట సాగు చేసినప్పటి నుంచి పంట కోతల వరకు రైతు భరోసా కేంద్ర సిబ్బంది ఈ–క్రాప్ బుకింగ్ చేపడుతున్నారు. పంటలు దెబ్బతింటే నష్టపరిహారం, ఇన్సూరెన్స్ అందేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ విధానంతో రైతులు ఎలాంటి పంటలు సాగు చేసినా నష్టపోయే పరిస్థితి లేదు. పంట నష్టపోతే రైతుల పొలాల వద్దకు ఆర్బీకే సిబ్బంది వచ్చి అంచనాలు వేసి నష్ట పరిహారానికి సిఫార్సులు చేస్తున్నారు. కొన్ని రోజుల్లోనే నగదు ఖాతాల్లో జమఅవుతోంది.

– నారాయణప్ప, నలంగంపల్లి గుడుపల్లె

అప్పుల నుంచి విముక్తి



ఆర్బీకేల ఏర్పాటుతో పంటల సాగు కోసం చేసే అప్పుల నుంచి ప్రభుత్వం విముక్తి కల్పించింది. పంటల సాగు సమయానికి అవసరమయ్యే పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా నగదును అకౌంట్‌లోకి జమ చేస్తోంది. ఎరువులు, విత్తనాలు ఇక్కడే దొరుకుతాయి. ఇష్టంతో పంటల సాగు చేస్తున్నా. రైతులకు ఇంత మంచి చేస్తున్న సీఎం జగనన్నకి పాదాభివందనం చేయాలి.

– శంకర్, రైతు, బల్ల, రామకుప్పం మండలం

గతంలో హామీలు నెరవేర్చావా బాబు?



పుంగనూరులో జరిగిన సమావేశానికి హాజరైన బలిజకులస్తులు



పుంగనూరులో శ్రీకృష్ణదేవరాయల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు ద్వారకనాథరెడ్డి, శ్రీనివాసులు, పోకల అశోక్‌కుమార్

- మేనిఫెస్టోను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దే
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- పుంగనూరులో శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం ఆవిష్కరణ

పుంగనూరు: ''ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 600 హామీల్లో ఏ ఒక్కటైనా నెరవేర్చావా... రుణమాఫీ పేరుతో రైతులను నిట్టనిలువునా ముంచేసిన విషయం మరిచావా చంద్రబాబూ'' అంటూ రాష్ట్ర విద్యుత్, అటవీ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా సుమారు రూ.3 కోట్లతో నిర్మించిన శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌ను ఆదివారం ప్రారంభించిన మంత్రి, రాయల విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. చంద్రబాబు రుణమాఫీ పేరుతో 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, ప్రజలను మోసగించారని గుర్తుచేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో 600 హామీలు ఇచ్చి ఒక్కటి కూడా నెరవేర్చలేదని చెప్పారు. ప్రజలను మోసగించడమే చంద్రబాబు మేనిఫెస్టో అని అభివర్ణించారు. జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను దోచుకుతిన్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని చెప్పారు. ఏ పార్టీ అయినా, కులం, మతం చూడకుండా పేదరికమే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కరోనాతో రాష్ట్రం రెండేళ్లు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని చెప్పారు. అయినప్పటికీ మొక్కవోని దీక్షతో సీఎం జగన్ సంక్షేమ పథకాలకు క్రమం తప్పకుండా అమలు చేశారన్నారు. అవినీతికి తావులేకుండా రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పథకాలు కొనసాగుతున్నాయని వివరించారు. చంద్రబాబు ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకుని రాష్ట్ర ప్రజలను మోసగించేందుకు కుట్రలు పన్నుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి అధిక ప్రాధాన్యత కల్పించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీనేనని కొనియాడారు. ప్రతిసారీ ఎన్నికల సమయంలో మాయమాటలతో మభ్యపెట్టడానికి వచ్చే నాయకులను ప్రజలు నమ్మొద్దని సూచించారు. సంక్షేమపాలన సాగిస్తున్న వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

చారిత్రక ఆధారాలు

శ్రీకృష్ణదేవరాయలు ఈ ప్రాంతంలో పరిపాలన సాగించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయని మంత్రి పెద్దిరెడ్డి స్పష్టం చేశారు. రాయలపాలన చంద్రగిరి నుంచి కర్ణాటకలోని హంపి వరకు విస్తరించిందన్నారు. ప్రతి రోజూ ప్రజల కష్టాలను ఆయనే స్వయంగా పరిశీలించేవారని చరిత్ర చెబుతోందన్నారు. తన పరిపాలనకు చిహ్నంగా తిరుపతి సమీపంలోని రాయల చెరువుతో పాటు అనేక ఆలయాలను శ్రీకృష్ణదేవరాయలు నిర్మించారని కొనియాడారు. అనంతరం బలిజ సామాజిక వర్గానికి చెందిన వారు వేలాది మంది హాజరై మంత్రి పెద్దిరెడ్డికి ఘన స్వాగతం పలికారు. మంత్రి పెద్దిరెడ్డి, అడపశేషు, ఎమ్మెల్యేలకు జ్ఞాపికలు ఇచ్చి సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, ఆరణి శ్రీనివాసులు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడప శేషు, టీటీడీ బోర్డు మాజీ మెంబరు పోకల అశోక్‌కుమార్, రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, తిరుపతి బలిజ సంఘం అధ్యక్షుడు లక్ష్మీపతి, సంఘం నాయకులు ఆకుల గజేంద్ర, నానబాలగణేష్, పూలత్యాగరాజు, కాపేరాక్స్ సభ్యులు కుమార్, మనోహర్, రమణ, మంజు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

అభినవ అంబేడ్కర్ సీఎం జగన్



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : దేశంలోనే అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని, పేద ప్రజల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నందుకు దళితులు జగనన్నను అభినవ అంబేడ్కర్‌గా ఆరాధిస్తున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మండల కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రతి దళితవాడలో శ్మశాన వాటిక సదుపాయం కల్పించారని చెప్పారు. అర్హులకు భూ పంపిణీ ద్వారా ఇంటి పట్టాతో ఇళ్లు మంజూరు చేసినట్లు గుర్తుచేశారు. నాడు–నేడు ద్వారా దళితవాడల్లో ఉండే పాఠశాలకు కొత్త రూపు రేఖలు తీసుకువచ్చి, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచి పేదలకు దేవుడయ్యారు అని అన్నారు. దళితులకు అన్ని రకాలుగా అండగా ఉన్నది కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అని, కానీ జగనన్న ప్రభుత్వంపై విషం చిమ్మేందుకు కొంతమంది గుంపులుగా వస్తున్నారు. ప్రజలు వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గతంలో చంద్రబాబుని దూషించిన పవన్‌కల్యాణ్ నేడు ప్యాకేజీకి అమ్ముడుపోయి చంద్రబాబుకు వత్తాసు పలకడం నీచమైన చర్య అంటూ ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ సర్వీసుల తనిఖీ

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ట్రాన్స్‌కో 8 డివిజన్ల పరిధిలోని విద్యుత్ సర్వీసులను సిబ్బంది తనిఖీ చేశారు. ఇందులో మొత్తం 3,192 సర్వీసులను తనిఖీ చేయగా తిరుపతి ఆపరేషన్ 80, తిరుపతి రూరల్ 49, పుత్తూరు 83, చిత్తూరు అర్బన్ 65, చిత్తూరు రూరల్ 54, మదనపల్లె 75, పీలేరు 60, పుంగనూరు పరిధిలో 88 కేసులు బుక్ చేశారు. ఇందులో విద్యుత్ అదనపు లోడ్ కేసులు 478 కేసులకు గాను క్రమబద్ధీకరణ రుసుం రూ.11.17 లక్షలు, చౌర్యం కేసులు 76కు గాను రూ.59 వేలు జరిమానాతో కలిపి మొత్తం 554 సర్వీసులపై కేసులు నమోదు చేసి రూ.11.76 లక్షలు చెల్లించాలని నోటీసులు ఇచ్చినట్లు ఎస్ఈ కృష్ణారెడ్డి వివరించారు.

ప్రజలకు మరింత సేవ



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మరింత సేవ చేస్తానని ఎమ్మెల్సీ భరత్ చెప్పారు. కడపల్లి వద్ద ఆదివారం నిర్వహించిన వన్నెకుల క్షత్రియ ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కుప్పంలోనే ఉండే తాను నిరంతరం గ్రామాలు తిరుగుతూ ప్రజలతోనే ఉన్నానని చెప్పారు. కరోనా కష్టకాలంలో స్థానికంగానే అందుబాటులో ఉండి చేసిన సేవలను గుర్తుచేశారు. హైదరాబాదులో ఉండే వారిని గెలిపిస్తే వారితో పనులు ఎలా చేయించుకుంటారని ప్రశ్నించారు. కుప్పం నియోజకవర్గంలో అత్యధిక జనాభా ఉన్న వన్నెకుల క్షత్రియ కులానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. గతంలో రెండు సార్లు తన తండ్రి దివంగత చంద్రమౌళికి ఇక్కడ నుంచి పోటీ చేసే అవకాశం ఇచ్చారని చెప్పారు.

బీసీలను అణచివేశారు

వన్నెకుల క్షత్రియ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వేణుగోపాల్, మండల అధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు మల్లానూరు మురుగేష్, బుల్లెట్ దండపాణి, ఆర్ఎంకె మురుగన్, కుమార్‌రాజా ప్రసంగించారు. కుప్పం ప్రజలు ఇచ్చిన అవకాశంతో ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి అయిన వ్యక్తి రెండు ఎకరాల నుంచి వేల కోట్లకు ఎదిగినా ఇక్కడి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడలేదన్నారు. ఇటీవల ఓ తల్లి తమ ఆస్తిలో 2 శాతం అమ్మితే రూ.400 కోట్లు వస్తాయని చెప్పారని అన్నారు. కుప్పం ప్రజల కష్టాన్ని పాలు, కూరగాయల రూపంలో దోచుకున్న వారి ఆస్తులు ఇంతగా పెరిగితే వాళ్ల పల్లకి మోసిన వారు మాత్రం పేదలుగానే మిగిలారని చెప్పారు. వన్నెకుల క్షత్రియులకు జగనన్న కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవటానికి పార్టీలకు అతీతంగా కులస్తులు ఒక తాటిపైకి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్‌పర్సన్ తానేటి వనిత, ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గమ్మ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

కుప్పం కాలువ పరిశీలన



శాంతిపురం: హంద్రీ–నీవా కుప్పం కాలువను ఇరిగేషన్ శాఖ ఇంజినీరింగ్ విభాగం ఉన్నత అధికారులు ఆదివారం పరిశీలించారు. ఇంజినీర్ ఇన్ చీఫ్ నారాయణరెడ్డి, ఎస్ఈ రాజగోపాల్ గుండిశెట్టిపల్లి వద్ద కాలువ సన్నద్ధతను తనిఖీ చేశారు. వి.కోట మండలంలోని కొడంగల్ ఎత్తిపోతల నుంచి ఇప్పటికే ముదిమడుగు చెరువు సమీపానికి నీరు చేరుకున్నట్లు తెలిపారు. ఆదినేపల్లి వద్ద ఉన్న ఎత్తిపోతలకు నీరు రాగానే అక్కడి మోటార్లను ఆన్ చేయిస్తామన్నారు. మరో 10 రోజుల్లో శాంతిపురం మండలంలోకి నీరు వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ రమేష్‌బాబు డీఈలు, ఏఈలు, కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులు వీరారెడ్డి, డేనియల్ పాల్గొన్నారు.

సాక్షి స్పెల్‌బీ సెమీస్‌కు విశేష స్పందన

- మూడు ఉమ్మడి జిల్లాల నుంచి హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

తిరుపతి ఎడ్యుకేషన్ : పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా, వారి ప్రతిభకు పదును పెట్టేందుకు సాక్షి స్పెల్‌బీ దోహదం చేస్తోంది. ఉన్నత విద్య అభ్యసించాలన్నా, ఉన్నత కొలువును సాధించాలన్నా ఆంగ్ల భాషపై పట్టు తప్పనిసరి. ఆంగ్ల భాషలో నైపుణ్యం, సామర్థ్యం ఉంటేనే నేటితరం ఉన్నతంగా రాణిస్తుంది. ఇంగ్లిష్‌పై విద్యార్థుల్లో అవగాహన కల్పించి, వారిలో నైపుణ్యం, ఆసక్తిని పెంపొందించేందుకు ఏటా సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా స్పెల్‌బీ పరీక్షలు నిర్వహిస్తోంది. తద్వారా వారిలో దాగి ఉన్న ప్రతిభకు పదునుపెడుతోంది. ప్రాథమిక, క్వార్టర్, సెమీఫైనల్, ఫైనల్ నాలుగు దశల్లో స్పెల్‌బీ నిర్వహించి.. ఫైనల్‌లో సత్తా చాటిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందిస్తోంది. ఈ పరీక్షకు ప్రధాన స్పాన్సర్‌గా డ్యూక్స్ వ్యాఫీ, అసోసియేషన్ స్పాన్సర్‌గా రాజమండ్రికి చెందిన ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరిస్తున్నాయి. సాక్షి నిర్వహిస్తున్న స్పెల్‌బీ పరీక్షలకు పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నారు. ఎప్పటిలానే ఈ ఏడాది సైతం విద్యార్థులు ఈ పరీక్షకు అధిక సంఖ్యలో హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు. అందులో భాగంగా ఆదివారం తిరుచానూరు రోడ్డు, శ్రీనివాసపురంలోని హోలీ గ్రీన్ పాఠశాలలో స్పెల్‌బీ సెమీఫైనల్స్ నిర్వహించారు. ఇదివరకు పాఠశాల స్థాయి, జిల్లా స్థాయి (క్వార్టర్ ఫైనల్స్)లో జరిగిన ఈ పరీక్షలో విజేతలకు సెమీఫైనల్స్ (మూడో రౌండు) పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు ఉమ్మడి చిత్తూరు, వైఎస్సార్ కడప, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

సాక్షి స్పెల్‌బీ సెమీ ఫైనల్ పరీక్షలు

కేటగిరి 1	:	1, 2వ తరగతులు
కేటగిరి 2	:	3, 4వ తరగతులు
కేటగిరి 3	:	5, 6, 7వ తరగతులు
కేటగిరి 4	:	8, 9, 10వ తరగతులు



తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని హోలీ గ్రీన్ పాఠశాలలో సాక్షి స్పెల్‌బీ సెమీ ఫైనల్ పరీక్షను రాస్తున్న విద్యార్థులు

ఆత్మవిశ్వాసం రెట్టింపు



విద్యార్థులు రాణించేందుకు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించాలి. అందుకు ప్రతి రోజూ ఇంగ్లిష్ భాషను సాధన చేయాలి. ఆంగ్లం న్యూస్ పేపర్లు, గ్రామర్‌తో పాటు ఇతర పుస్తకాలను చదవాలి. అర్థం కాని పదాలను డిక్షనరీ సాయంతో తెలుసుకోవాలి. అద్దం ముందు నిలబడి ఇంగ్లిష్‌లో మాట్లాడుతూ సాధన చేయాలి. విద్యార్థుల ఉన్నతికి బాటలు వేసేలా సాక్షి మీడియా గ్రూప్ స్పెల్‌బీ నిర్వహిస్తూ వారిలో ఆత్మస్థైర్యం, ఇంగ్లిష్ భాషపై పట్టు, నైపుణ్యం పెంపొందిస్తుండడం అభినందనీయం.

- సి.వేణుగోపాల్‌రెడ్డి, చైర్మన్, హోలీగ్రీన్ స్కూల్, తిరుపతి

బాగా ప్రాక్టీస్ చేశా



సాక్షి నిర్వహిస్తున్న స్పెల్‌బీ సెమీ ఫైనల్ పరీక్షకు బాగా ప్రిపేర్ అయ్యా. స్పెల్‌బీ మెటీరియల్‌లోని కొత్త పదాలు, వాటి స్పెల్లింగ్స్ నేర్చుకున్నా. ఈ పరీక్షలో రాణించి ఫైనల్‌కు చేరుకుని అక్కడ నా ప్రతిభను చాటుకోవాలనుకుంటున్నా.

- ఈ.రుక్విద్, 3వ తరగతి, ప్రశాంత్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, తిరుపతి

కొత్త పదాలు తెలిశాయి



స్పెల్‌బీ పరీక్షలో ఈ ఏడాది తొలిసారిగా పాల్గొన్నా. స్పెల్‌బీ మెటీరియల్‌లోని పదాలను రోజూ సాధన చేశా. ఇందులో చాలా వరకు కొత్త పదాలు ఉన్నాయి. వాటిని ఎలా పలకాలి, స్పెల్లింగ్ ఎలా రాయాలో మా టీచర్లను అడిగి తెలుసుకున్నా. కొత్త పదాలు వల్ల ఇంగ్లిష్ భాషపై పట్టు, నైపుణ్యం పెరిగింది.

- ఎం.లిపిక, 6వ తరగతి, జేసీఆర్ శ్రీచైతన్య స్కూల్, తిరుపతి

ఇంగ్లిష్‌పై ఆసక్తి



స్పెల్‌బీ పరీక్షకు ఈ ఏడాది తొలిసారిగా హాజరయ్యా. పాఠశాల, క్వార్టర్ ఫైనల్ స్థాయిలో ప్రతిభ కనబరిచి సెమీ ఫైనల్‌కు చేరడం సంతోషంగా ఉంది. స్పెల్‌బీ ద్వారా నాలో ఇంగ్లిష్ భాషపై ఆసక్తి పెరిగింది. కొత్త పదాలు తెలుసుకోవడంతో ఆ భాషపై పట్టు సాధించగలిగా. థ్యాంక్స్ టు సాక్షి.

- ఎస్.మొహమ్మద్ నిహాల్, 5వ తరగతి, నాగార్జున ఇంగ్లిష్ మీడియం స్కూల్, వైఎస్సార్ కడప

స్పెల్లింగ్స్ నేర్చుకున్నా



నాకు ఇంగ్లిష్ భాష అంటే ఇష్టం. స్కూల్ లెవెల్‌లో అన్ని పదాలకు స్పెల్లింగ్స్ నేర్చుకున్నా. అయితే స్పెల్‌బీ ద్వారా కొత్త పదాలు, వాటి స్పెల్లింగ్స్‌తో పాటు ఆయా పదాలను ఎలా ఉచ్చరించాలి అనే విషయాలు నేర్చుకున్నా. గ్రామర్ బాగా తెలిసొచ్చింది.

- వి.దియ, 7వ తరగతి, ఎడిఫై స్కూల్, తిరుచానూరు

నైపుణ్యం పెరిగింది



ఇంగ్లిష్‌పై ఆసక్తి పెరగడానికి స్పెల్‌బీ దోహదపడింది. అనేక కొత్త పదాలు తెలుసుకున్నా. ఈ స్పెల్‌బీ పరీక్ష ద్వారా ఇంగ్లిష్ భాషపై పట్టు, నైపుణ్యం పెరిగింది. సరళంగా, తప్పులు లేకుండా ఆంగలం మాట్లేడేందుకు స్పెల్‌బీ దోహదపడింది.

- ఎస్.విశాల్‌కుమార్‌రెడ్డి, 7వ తరగతి, రెయిన్‌బో స్కూల్, నెల్లూరు

ఫైనల్ చేరడమే లక్ష్యం



స్పెల్‌బీ పరీక్షకు ప్రిపేరయ్యే కొద్దీ చాలా ఆసక్తి పెరిగింది. గత ఏడాది సెమీ ఫైనల్ వరకు వచ్చా. ఈ ఏడాది ఎలాగైనా ఫైనల్‌కు వెళ్లాలన్నదే నా లక్ష్యం. దీని కోసం స్పెల్‌బీ మెటీరియల్‌లో అనేక కొత్తకొత్త పదాలను స్పెల్లింగ్ తప్పులు లేకుండా రాసేందుకు బాగా సాధన చేశా.

- కె.భావన, 10వ తరగతి, సంసిద్ క్యాంఫోర్డ్ ఈస్ట్ క్యాంపస్ స్కూల్, చిత్తూరు

విన్నర్ కావాలి



స్పెల్‌బీలో వరుసగా నాలుగు ఏళ్లు పాల్గొన్నా. ఈ ఏడాది ఐదో మారు. గత ఏడాది ఫైనల్ వరకు వెళ్లి రన్నర్‌గా నిలిచా. ఈ ఏడాది సాక్షి స్పెల్‌బీలో విన్నర్‌గా కావడమే నా లక్ష్యం. దీనికోసం స్పెల్‌బీ మెటీరియల్‌ను బాగా సాధన చేశాను. కొత్త పదాలు, వాటి స్పెల్లింగ్, ఉచ్చారణను మా టీచర్ ద్వారా నేర్చుకున్నాను.

- కె.జ్యోతిష, 9వ తరగతి, 10వ తరగతి, సంసిద్ క్యాంఫోర్డ్ ఈస్ట్ క్యాంపస్ స్కూల్, చిత్తూరు

19 వరకు జనభాగీదారి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా జనభాగీదారీ కార్యక్రమాలను ఈ నెల 19 వరకు విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయానికి స్ఫూర్తిగా 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ ఈ నెల 19న విజయవాడలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా జనభాగీదారి కార్యక్రమాలను ఈ నెల 19వ తేదీ వరకు షెడ్యూల్ మేరకు నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో అన్ని వర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు, మహిళలు, సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ నెల 8వ తేదీన జిల్లాలోని విద్యా సంస్థల్లో విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు, డ్రాయింగ్, డిబేట్, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించాలని చెప్పారు. ఈ నెల 7వ తేదీ నుంచి 11 వ తేదీ వరకు జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహాలను ఆవిష్కరించాలని తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచి 18 వ తేదీ వరకు జిల్లా స్థాయిలో ఫోటో ఎగ్జిబిషన్, లఘు చిత్రాలను ప్రదర్శించాలన్నారు. సామాజిక న్యాయంపై ఫ్లెక్సీని తయారు చేసి సంతకాల సేకరణ ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు. ఈ నెల 18న మారథాన్ రన్ తదితర కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ వెల్లడించారు.


మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

భారీ ఎత్తున సీఐల బదిలీలు

చిత్తూరు అర్బన్ : తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పని చేస్తున్న సీఐలు భారీ ఎత్తున బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆదివారం అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మూడేళ్లకు పైబడి ఒకే చోట పనిచేస్తున్న సీఐలకు స్థానచలనం కల్పించారు. రెండు జిల్లాల్లో బదిలీ అయిన సీఐల వివరాలు ఇలా

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ ప్రాంతం
చిత్తూరు జిల్లా పరిధిలో.		
గంగిరెడ్డి	చిత్తూరు రూరల్ ఈస్ట్ సర్కిల్	ఎస్‌బీ, చిత్తూరు
శ్రీధర్	కుప్పం అర్బన్ పోలీస్ స్టేషన్	సైబర్ క్రైమ్ సెల్, చిత్తూరు
బాలయ్య	దిశా, పీఎస్, చిత్తూరు	డీసీఆర్‌బీ, చిత్తూరు
సుబ్రహ్మణ్యం	డీసీఆర్‌బీ, చిత్తూరు	వీఆర్-ఎస్పీ, అనంతపురం
ఆశీర్వాదం	వీఆర్-ఎస్పీ, చిత్తూరు	వీఆర్-ఎస్పీ, అనంతపురం
ప్రసాద్‌బాబు	వీఆర్-ఎస్పీ, చిత్తూరు	వీఆర్-ఎస్పీ, సత్యసాయి జిల్లా
చల్లనిదొర	వీఆర్-ఎస్పీ, చిత్తూరు	వీఆర్, రేంజ్ ఆఫీస్, అనంతపురం

జిల్లా వాలీబాల్ జట్టు ఎంపిక

రొంపిచెర్ల: జిల్లా వాలీబాల్ జట్టును ఎంపిక చేసినట్లు రూరల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి అశ్వింధర్ తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మాట్లాడుతూ జట్టు వివరాలను వెల్లడించారు. అండర్-16 విభాగంలో ఎస్.నబెల్, ఎస్.ఇర్షాన్, బి.జావిద్, వి.షమీవుల్లా, ఎస్.క్రాంతి చరణ్, సి.ఇర్ఫాన్, వై.యాసిన్, కె.రయణ్, పి.రౌనక్, ఎస్. దస్తగిర్, ఇ.పార్థు, కె.తనిష్, జి.జయ ప్రకాష్, వి.కళ్యాణ్‌రామ్ ఎంపిక అయ్యారని తెలిపారు. అండర్ -19 విభాగంలో పి.ఎండీ. ఖాలిద్, ఎస్.వాసు, ఇ.ఉదయ్ కిరణ్, ఎం.ఓబులేసు, కె.హర్ష వర్ధన్, టి.అష్రఫ్, టి.షాహిద్, పి.గురుదేవ్, కె.నాగ సుబ్రమణ్యం, ఆర్.రెడ్డి ప్రసాద్ ఎంపిక అయ్యారని చెప్పారు. ఈ సమావేశంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి రమణ పాల్గొన్నారు.

చెకుముకి పోటీలు విజయవంతం

పలమనేరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి చెకుముకి పోటీలు విజయవంతమైందని, ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గిరిధరమూర్తి తెలిపారు. ఈ పోటీలకు జిల్లాలోని పలు పాఠశాలలనుంచి 50 టీమ్‌లు 150మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో జెడ్పీ హైస్కూల్ గొనుగూరు(కుప్పం), ఇంపెల్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్(పుంగనూరు) రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు నిర్వాహకులు తెలిపారు. వచ్చేనెల 10, 11 తేదీల్లో బాపట్లలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ రెండు పాఠశాలల పిల్లలు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకు చెకుముకి పోటీలు ఎంతగానో ఉపకరిస్తున్నట్టు ఉయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా నాయకులు బాల చైతన్య, ఎంఈవోలు లీలారాణి, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, రాష్ట్ర సంఘం నాయకులు కుమారస్వామిరెడ్డి, యుగంధర్ బాబు, సుదర్శనాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పశువుల పండుగ

బైరెడ్డిపల్లె : మండలంలోని ధర్మపురి పంచాయతీ పరిధిలో ఉన్న మేకలనాగిరెడ్డిపల్లెలో ఆదివారం ప్రశాంతంగా పశువుల పండుగ ముగిసింది. చుట్టు పక్కల ప్రాంతాల నుంచే కాక కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి పశువులు భారీగా తరలి వచ్చి పోటీల్లో పాల్గొన్నాయి. పశువులు నువ్వా..నేనా అన్న రీతిలో పరుగులు పెట్టాయి. యువత ఉల్లాసంగా.. ఉత్సాహంగా పశువులను అడ్డుకునేందుకు ఎగబడ్డారు. గెలుపొందిన పశువులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

ఎంబీయూలో ఘనంగా స్పోర్ట్స్ డే

- ఆకట్టుకున్న విద్యార్థుల నత్య ప్రదర్శన
- ముఖ్యఅతిథిగా హాజరైన డ్యాన్స్ మాస్టర్ ప్రభుదేవా

చంద్రగిరి : మండలంలోని శ్రీసాయినాథ నగర్‌లో ఉన్న మోహన్‌బాబు యూనివర్సిటీలో ఆదివారం ఘనంగా స్పోర్ట్స్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ ప్రభుదేవా హాజరయ్యారు. ముందుగా ప్రభుదేవాకు ఎంబీయూ చాన్సలర్ మంచు మోహన్‌బాబు, ప్రో చాన్సలర్ మంచు విష్ణు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం స్పోర్ట్స్ డే జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రభుదేవా మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతి ఒక్కరూ రాణించాలన్నారు. మానసిక దృఢత్వంతో పాటు శారీరకంగా బలంగా తయారైతే ఎంతటి లక్ష్యమైనా సులువుగా సాధించవచ్చని సూచించారు. స్పోర్ట్స్ డేను వేడుకగా క్రమశిక్షణతో నిర్వహించడం అభినందనీయమన్నారు. సుమారు 30 ఏళ్ల క్రితం విద్యాసంస్థగా ప్రారంభమై నేడు యూనివర్సిటీ స్థాయికి ఎదగడం వెనుక మోహన్‌బాబు కృషి, దీక్ష, పట్టుదల ఉన్నాయని కొనియాడారు. క్రీడలు, విద్యపై దృష్టి సారించి గొప్పగా భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో విశేష ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాపోటీల్లో విజేతలకు మోహన్‌బాబు, ప్రభుదేవా, మంచు విష్ణు చేతులమీదుగా బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం చాన్సలర్ మోహన్‌బాబుతో కలసి ప్రభుదేవా, కళాకారులు నృత్యం చేసి ఆహుతులను అలరించారు. ఈ క్రమంలోనే ముఖ్యఅతిథి ప్రభుదేవాను ఘనంగా సత్కరించి, జ్ఞాపిక బహూకరించారు.


ప్రదర్శనలిచ్చిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రభుదేవా, మోహన్‌బాబు, విష్ణు

అట్టహాసంగా ఫ్రెషర్స్ డే

ఎంబీయూలో నూతనంగా ఇంజినీరింగ్‌లో చేరిన విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రభుదేవా మాట్లాడుతూ ఇంత గొప్పగా విద్యాసంస్థలను నిర్వహించడం మోహన్‌బాబుకే సాధ్యమైందని ప్రశంసించారు. కార్యక్రమాల్లో ఎంబీయూ ఈడీ వినయ్ మహేశ్వరి, వీసీ నాగరాజా రామారావు, రిజిస్ట్రార్ సారధి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కుటుంబాలు


మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరిన తెలుగుదేశం పార్టీ కుటుంబాలు

రామకుప్పం: మండలంలోని మిట్టపల్లెకు చెందిన 30 తెలుగుదేశం పార్టీ కుటుంబాలు స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో ఆదివారం పుంగనూరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీలోకి చేరినవారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలోకి చేరినట్లు తెలిపారు. కుప్పంలో భరత్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని వారు పేర్కొన్నారు. టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరినవారిలో కిరణ్‌కుమార్, రంజిత్, చరణ్, విజయ్‌కుమార్, మురళి, రవి, బాబు, కార్తీక్, మంజునాథ్, హరిప్రసాద్, విజయ్, మునిరాజు, నవీనచందు, శివకుమార్, నాగరాజు, సుబ్రమణ్యం, బాబు, మురళి, రాజశేఖర్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, సర్పంచ్ మురళీకృష్ణ, సచివాలయ కన్వీనర్ రామిరెడ్డి, యువజన విభాగం మండల కన్వీనరు యశ్వంత్ రెడ్డి, నేతలు మధు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి


రవీంద్రనాయుడు (ఫైల్)

పూతలపట్టు: వాహనం ఢీకొని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు మోటాకంపల్లెకు చెందిన ఆర్.రవీంద్ర నాయుడు(61)వృత్తి రీత్యా బెంగళూరులో స్థిరపడ్డారు. ఆయన శనివారం రాత్రి పి.కొత్తకోట సమీపంలో బస్సు దిగి ఎదురుగా ఉన్న హోటల్‌కు వెళ్లటానికి రోడ్డు దాటుతుండగా ఈచర్ వ్యాను ఢీ కొంది. ప్రమాదంలో రవీంద్రనాయుడు అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారమందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వ్యాన్ డ్రైవర్‌ను నెల్లూరు జిల్లా పెరుమాళ్లపల్లెకు చెందిన సుబ్రమణ్యంగా గుర్తించారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పెద్దపంజాణి: కర్ణాటక నుంచిఅక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లికార్జున తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అప్పినపల్లెకు చెందిన చందు(27) ద్విచక్ర వాహనంలో హెబ్బిని నుంచి కర్ణాటక మద్యం 120 టెట్రా ప్యాకెట్లు తీసుకువస్తుండగా అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ద్విచక్ర వాహనంతో సహా మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.